గజ్వేల్‌లో సీపీఎం మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రేవంత్ సర్కార్‌పై ఇక పోరుబాటే

- హామీలపై ప్రజల ఆశలు ఆవిరి
- 420 హామీల్లో ఫ్రీ బస్సు ఒక్కటే అమలు
- లగచర్లలో అఘాయిత్యాలు చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే
- సిద్దిపేట జిల్లా సీపీఎం మహాసభల్లో తమ్మినేని వీరభద్రం ఫైర్

గజ్వేల్, డిసెంబర్ 1: ఎన్నికల హామీల అమలు కోసం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజల పక్షాన పోరాటం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఫ్రీ బస్సు తప్ప ఒక్కటీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు కూడా విమర్శలు చేస్తున్నారని చెప్పారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలకు ఆకర్షితులై ఓట్లు వేస్తే ప్రజల ఆశలు ఆవిరయ్యాయని మండిపడ్డారు. లగచర్ల ఘటనలో సాగుభూములు తీసుకునేది, కేసులు నమోదు చేయించేది, ప్రజలపై అఘాయిత్యాలకు పాల్పడేది ప్రభుత్వమేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లగచర్ల భూముల్లో తొండలు గుడ్లు పెట్టవని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని, కానీ, అక్కడి రైతులు సాగు చేసుకొని బతుకుతున్నామని చెప్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని దుయ్యబట్టారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాటు చేసే కంపెనీలకు సాగుయోగ్యంగా లేని బండరాళ్లతో ఉన్న భూములను మాత్రమే తీసుకోవాలని సూచించారు. అదే ప్రాంతానికి చెందిన గురున్నాథ్ రెడ్డికి 1,156 ఎకరాల భూమి ఉన్నదని, సీలింగ్ చట్టం ప్రకారం ఆ భూమిని ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం లేకుండా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకొవడం కరెక్ట్ కాదని కుండబద్దలు కొట్టారు. హైడ్రా, మూసి పేరుతో ఎస్సీ, ఎస్టీ ఇండ్లను కూల్చుతున్నారని, ప్రభుత్వంపై ప్రజా పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

అదానీతో ఒప్పందాలు బయటపెట్టాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో అదానీతో రూ.12,400 కోట్లతో ఏడు ఎంవోయూలు కుదుర్చుకున్నారని, రాష్ట్రంలో అంబుజా సిమెంట్, సోలార్ కరెంట్‌పై చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలని తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ఒకవైపు అదానీని వ్యతిరేకిస్తుంటే, స్కిల్ యూనివర్సిటీకి కోసం రేవంత్‌రెడ్డి అదే అదానీ నుంచి రూ.రూ.100 కోట్ల చెక్కు తీసుకున్నారని విమర్శించారు. మహాసభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరాటాలతోనే లగచర్ల ఫార్మాసిటీ, నిర్మల్ ఇథనాల్ ఫ్యాక్టరీలపై ప్రభుత్వం వెనక్కి: బీవీ రాఘవులు

హైదరాబాద్/సంగారెడ్డి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రైతుల పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం లగచర్ల ఫార్మాసిటీ, నిర్మల్ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుపై వెనక్కి తగ్గిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీ స్థానంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామంటూ రైతుల నుంచి భూములు లాక్కునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త ట్రిక్కులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన హైదరాబాద్, సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయాల్లో మీడియాతో మాట్లాడుతూ.. ఫార్మా అయినా, ఇండస్ట్రియల్ పార్కు అయినా రైతుల భూములను లాక్కోవాలని ప్రభుత్వం చూడటం, సీఎం రేవంత్‌రెడ్డి ఇంత పట్టుదలకు పోవడం సరికాదని హితవు చెప్పారు. లగచర్లలో రైతులు పంటలు పండిస్తున్న భూముల సేకరణను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం విషయంలో వామపక్షాలు వెనక్కితగ్గేది లేదని స్పష్టంచేశారు. రాహుల్‌గాంధీ ఒత్తిడి వల్లనే సీఎం రేవంత్‌రెడ్డి అదానీకి రూ.100 కోట్లు వాపస్ చేశారని చెప్పారు. ముడుపుల కుంభకోణం నుంచి అదానీని రక్షించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి అదానీ వ్యవహారం తేల్చాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత 55 లక్షల ఓట్లు పోల్ కావడం అనుమానానికి దారితీస్తున్నదని చెప్పారు.

సూదిమొనంత.. భూమి కూడా ఇయ్యం!

మొదటిపేజీ తరువాయి...

కొంతమంది జైళ్లలో మగ్గుతున్నారు. వారిని చూసేందుకు వెళ్లలేక, తమ వాళ్లు ఎప్పుడు వస్తారా అని వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. కనీసం జైల్లో ఉన్న వారిని విడిపిస్తారని ఆశించినా.. తన మీదే కేసులు ఉన్నాయని రేవంత్ చెప్పకనే చెప్పి సహాయ నిరాకరణ చేయడంపై మండిపడుతున్నారు.

ఆగని పోలీసుల సెర్చ్ ఆపరేషన్

జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలతో తండాల్లో ఆగిన పోలీసుల సెర్చ్ ఆపరేషన్ మళ్లీ ప్రారంభమైంది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కూడా విచారించి అమాయకులపై చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశించినా పోలీసులు మాత్రం మళ్లీ తండాల్లో తిష్ట వేశారు. ఏకంగా మహిళల దగ్గరికి వెళ్లి 'మీ వాళ్లు ఎక్కడికి వెళ్లారో చెప్పండి.. లేకపోతే మీకే నష్టం' అంటూ బెదిరిస్తున్నారని గిరిజనులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేసులైన వారిపై పోలీసులు నిఘా పెంచారు. తండాల్లో ఉన్న గిరిజనుల ఫోన్ నంబర్లు తీసుకొని కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. అనుమానితుల ఫోన్లపై నిఘా ఉంచారు. మళ్లీ పోలీసుల రాకతో లగచర్ల తండాలు భయంతో వణికి పోతున్నాయి.

బిక్కుబిక్కుమంటూ బతుకులు

పోలీసులకు భయపడి గిరిజనులు పొలాలు, పొదల్లో దాక్కుంటున్నారు. చాలామంది ఇండ్లకు తాళాలు వేసుకుంటున్నారు. చీకటి పడ్డాక వచ్చి ఇంతకలో గంజో తాగి రాత్రయితే మహిళలంతా ఒక్కచోటి చేరి బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. 'ఈ రాత్రి గడిస్తే చాలు దేవుడా' అంటూ మొక్కుకుటున్నారు. 22 రోజుల్లో 24 గంటలు మాత్రమే ప్రశాంతంగా ఉన్న లగచర్ల తండాలో మళ్లీ భయం పెరిగింది.

లగచర్ల పరిధిలో నిర్మానుష్యంగా రోటిబండతండా

తాజాగా సీఎం ప్రకటనపై లగచర్లవాసుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఆదివారం 'నమస్తే తెలంగాణ' బృందం పర్యటించింది. పోలీసులు, నమస్తే తెలంగాణ బృందం తప్ప లగచర్ల, రోటిబండతండా, పులిచర్ల తండాల్లో ఇండ్లన్నీ తాళాలు వేసి కనిపించాయి. గ్రామాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. పోలీసు వాహనాలను చూస్తేనే స్థానికులు భయపడిపోతున్నారు. 22 రోజులుగా తమ గ్రామాలకు రావాలంటే చుట్టాలు కూడా భయపడిపోతున్నారని తామేం పాపం చేశామని అక్కడున్న కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రకటనపై మండిపాటు

ఎట్టి పరిస్థితుల్లోనూ భూసేకరణ జరుగుతుందని శనివారం సాక్షాత్తు సీఎం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వేదికగా చేసిన ప్రకటనపై దుద్యాల మండలంలోని గ్రామాలవారు మండిపడుతున్నారు. జైళ్లలో ఉన్న తమ వారిని విడిపిస్తారనుకుంటే సీఎం అలాంటి ప్రకటన ఏదీ చేయక పైగా తప్పించుకునేలా మాట్లాడడంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎండిపోతున్న పంటలు..

ఫార్మా క్లస్టర్‌కు భూములిచ్చేది లేదని తిరగబడ్డ గిరిజన తండాల్లో పరిస్థితి ఘోరంగా మారింది. అదే రోజు అర్ధరాత్రి పోలీసులు తలుపులు బద్దలు కొట్టి ఘటనతో సంబంధం ఉన్న వాళ్లను, లేని వాళ్లను కూడా తీసుకెళ్లి జైళ్లలో వేయగా చాలామంది అప్పటికే భయంతో పారిపోయారు. దీంతో గ్రామాల్లో మగవాళ్లు లేక వ్యవసాయ పనులన్నీ ఆగిపోయాయి. కోతకు వచ్చిన దశలో వరి పంటలు ఎండిపోతున్నాయి. పల్లి పంటకు నీళ్లు మళ్లించే వారే లేక మహిళలే పంటలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కోసిన పంటను అమ్ముకొచ్చే మగదిక్కు లేక కన్నీటిపర్యంతమవుతున్నారు.

భూములిచ్చి రౌడీలమనిపించుకోవాల్నా

మేము భూములియ్యాలె.. మళ్లీ రౌడీలమనిపించుకోవాలెనా? ఇదెక్కడి న్యాయం సారు? మేమేం పాపం చేసినం? మాతానే భూములున్నాయా? నీ కొండారెడ్డిపల్లిలో లేవా? కోస్గిలో లేవా? ఇక్కన్నే ఎందుకు? మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వరా? మమల్ని సంపినా సరే.. మా భూములు ఇయ్యంగాక ఇయ్యం. సూది మొనంత జాగా కూడా ఇయ్యం.

-సోనీబాయి, రోటి బండతండా, దుద్యల మండలం, వికారాబాద్ జిల్లా

మీ ఊర్లె ఏసుకో..

భూమి మీద చేసుకొని బతికేటోళ్లం. మా భూములిచ్చి మేమేడికి పోవాలె? మాకు ఏ కంపెనీ వద్దు.. ఏదీ వద్దు. మా భూములు మాకే కావాలె. ఎట్ల రద్దు చేసిండ్రో అట్లనే వదలిపెట్టాలె. నీ కంపెనీలు కావాల్నంటే వేరేతాన ఏస్కో.. కోస్గి అవతల ఏస్కో.. మీ ఊర్లె ఏస్కో. ఏడాది కూడా కాలేదు.. గెలిపించిన పాపానికి మమ్మల్ని రౌడీలను చేసిండు. ఇంత అన్యాయమా?

- మీరాబాయి, రోటిబండతండా, దుద్యల మండలం, వికారాబాద్ జిల్లా

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	19.0°c	32.2°c
మెదక్	19.1°c	33.9°c
రంగారెడ్డి	19.3°c	33.0°c
నిజామాబాద్	21.0°c	31.6°c
హైదరాబాద్	21.8°c	28.0°c
వరంగల్	22.0°c	28.0°c
మహబూబ్‌నగర్	22.0°c	28.0°c
కరీంనగర్	22.0°c	28.0°c
ఖమ్మం	23.0°c	23.0°c
నల్లగొండ	23.4°c	28.0°c

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు

- తీరం దాటిన ఫెంగల్ తుఫాను
- స్వల్పంగా పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను తీరం దాటినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడులో భారీ నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. సోమవారం కూడా పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఏపీలోని తిరుమలలో గోగర్భం జలాశయం రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగా జలాశయాల్లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. రెండో ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడినట్టు సమాచారం. ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. తుఫాను ప్రభావంతో దక్షిణ తెలంగాణలో చలి తీవ్రత తగ్గింది. హైదరాబాద్‌లో రెండ్రోజుల క్రితం 15 డిగ్రీల దిగువకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండగా, 21డిగ్రీలకు పెరిగింది. మరో రెండ్రోజులు ఇదే వాతావరణం ఉండే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

స్టాక్ ట్రేడింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

రాజస్థాన్‌లో పట్టుకున్న టీజీసీఎస్‌బీ పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): స్టాక్ ట్రేడింగ్ పేరిట సోషల్ మీడియా ద్వారా భారీ మోసానికి పాల్పడిన కేసులో రాజస్థాన్‌కు చెందిన ఇద్దరిని టీజీసీఎస్‌బీ పోలీసులకు పట్టుబడ్డారు. రాహుల్ దంగి, రాహుల్ భోయ్ అనే నిందితులను ఉదయ్‌పూర్‌లో అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ ఆదివారం ప్రకటించారు. స్టాక్ ట్రేడింగ్ పేరిట తన నుంచి దశలవారీగా రూ.8.14 కోట్లు మోసం చేసినట్టు బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. రాహుల్ దంగి కరెంట్ ఖాతాకు బాధితుడి నుంచి రూ.75 లక్షలు బదిలీ అయ్యాయని పోలీసులు తేల్చారు. రాహుల్ దంగికి దేశవ్యాప్తంగా 35 నేరాలతో సంబంధం ఉన్నదని, ఆయన ఖాతా ద్వారా రూ.3.7 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. మరో నిందితుడు రాహుల్ భోయ్‌ని అకౌంట్ సప్లయర్‌గా గుర్తించారు.

కన్నడ నటి శోభిత ఆత్మహత్య!

శేరిలింగంపల్లి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కొండాపూర్‌లో కన్నడ నటి శోభిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గచ్చిబౌలి సీఐ హబీబ్ ఉల్లా ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం కన్నడ నటి శోభిత తన భర్త సుధీర్‌తో కలిసి కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీ సీ బ్లాకులో నివాసం ఉంటున్నారు. కన్నడ సినిమా, సీరియల్స్‌లో నటించిన శోభిత పెళ్లి తర్వాత నటించడం మానేశారు. భర్త ఐటీ కారిడార్‌లోలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండడంతో నగరానికి వచ్చారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శోభిత బెడ్‌రూంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో 497 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్

- రెండు రోజుల్లో రెండో నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం
- లగచర్లలో మొత్తం 607 ఎకరాల భూ సేకరణ
- 60 రోజుల్లో అభ్యంతరాలు చెప్పాలని స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : పచ్చని పొలాల్లో పరిశ్రమల ఏర్పాటును స్థానికులు ఎంత వ్యతిరేకిస్తున్నా భూ సేకరణపై ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల పరిధిలో బహుళార్థసాధక పారిశ్రామికవాడ కోసం మరో 497ఎకరాలు సేకరించేందుకు ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏవైనా అభ్యంతరాలుంటే 60 రోజుల్లోగా తాండూరు డివిజన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని స్పష్టం చేసింది. లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలు సేకరించేందుకు శనివారం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా లగచర్లలో మరో 497ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఒక్క లగచర్లలోనే ఇప్పటివరకు 607.39 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల పరిధిలో 1358.37 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీచేసి అభిప్రాయ సేకరణ చేపట్టగా, రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన వ్యక్తం కావడంతో వెనక్కితగ్గింది. ఇప్పుడు ఫార్మా విలేజ్ స్థానంలో బహుళార్థసాధక పారిశ్రామికవాడ పేరుతో మరోసారి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు 679.31 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినట్టయింది. లగచర్లలో క్రితంసారి 632.26 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, ఇప్పుడు 607.39 ఎకరాలకే నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. ఒకేసారి కాకుండా క్రమక్రమంగా భూముల సేకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. పరిహారం పెంచి అయినా భూసేకరణ చేయాలని పట్టుదలతో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఈ క్రమంలోనే శనివారం మహబూబ్‌నగర్ సభలో సీఎం మాట్లాడుతూ, పారిశ్రామికవాడ ఏర్పాటును సమర్థించుకున్నారు. అవసరమైతే ఎకరాకు రూ.20 లక్షలయినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. కాగా, బహిరంగ మార్కెట్‌లో ధరలకు, ప్రభుత్వం చెప్తున్న ధరలకు పొంతన లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున ఇచ్చినా తాము ఇతర ప్రాంతాల్లో మళ్లీ భూములు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూములు కోల్పోతే ఉపాధి పూర్తిగా పోతుందని ఆందోళన చెందుతున్నారు. భూ సేకరణపై ఓవైపు ప్రభుత్వ మొండి పట్టుదల, మరోవైపు రైతుల ఆందోళనతో లగచర్ల ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ఆసిఫాబాద్ జిల్లాను వణికిస్తున్న పులి

వరుస దాడులతో ప్రజల్లో భయంభయం

పులి అన్వేషణలో నిమగ్నమైన బృందాలు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాను పులి వణికిస్తున్నది. సిర్పూర్(టి) మండటం ఇటిక్యాల పహాడ్ శివారులో పులి సంచారం కలకలం రేకెత్తిస్తున్నది. రెండు రోజుల వ్యవధిలో మూడు పశువులు, ఇద్దరు మనుషులపై దాడికి పాల్పడింది. శనివారం లేగదూడను చంపి ఎద్దుపై దాడి చేసింది. కెనాల్ ఏరియాలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతాన్ని ఫారెస్ట్ అధికారులు జల్లెడ పట్టారు. పులి మానటరింగ్ కోసం 10 ప్రత్యేక బృందాలను, 200 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి ఆచూకీని గుర్తించేందుకు డ్రోన్‌ను వినియోగించి మహారాష్ట్రకు రెండు కిలో మీటర్ల దూరంలో పులి ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం చేనులో పని చేస్తున్న ఓ మహిళపై పులి దాడి చేయగా ఆమె చనిపోయింది. శనివారం సురేశ్ అనే రైతుపై దాడి చేయగా అతడు మంచిర్యాల దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఆవును చంపిన చిరుత

బజార్‌హత్నూర్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం బుర్కపల్లి అటవీ ప్రాంత శివారులో చిరుత పులి ఆవుపై దాడి చేసి చంపింది. అటవీ అధికారి పుండలిక్ వివరాల ప్రకారం బుర్కపల్లికి చెందిన రైతు రవి శనివారం ఆవును మేపేందుకు అడవి సమీపంలోకి పంపాడు. రాత్రి వరకు ఆవు తిరిగి రాకపోవడంతో ఆదివారం ఉదయం గాలించగా ఆవుపై చిరుత దాడి చేసిన ఆనవాళ్లు కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. ఆవు విలువ రూ.30 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

ఆపరేషన్ టైగర్

ఆసిఫాబాద్ జిల్లాలోని 15 గ్రామాల్లో అధికారులు 163సెక్షన్ విధించారు. కవ్వాల్ అభయారణ్యంలో నాలుగేళ్లలో పులుల సంఖ్య అనుహ్యంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అందుకే ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబర్‌లో సహజంగా మగ ఆడ పులులు జతకట్టే సమయం అని, అందులో భాగంగా పులులు సాధారణం కంటే తమ జోడు కోసం అడవిలో ఎక్కువ దూరం ప్రయాణం చేస్తుంటాయని అధికారులు చెప్పారు. కొన్ని సందర్భాల్లో అడవిని దాటి చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ సంచరిస్తూ ఉంటాయని వెల్లడించారు. ఈ సమయంలో పులులు సహజంగా కొంత ఉద్రేకంతో ఉంటాయని తెలిపారు. తమ తోడును వెతుక్కునే క్రమంలో పులులు చురుకుగా తిరుగుతూ ఉంటాయని, అందుకే నవంబర్, డిసెంబర్‌లో పులి దాడులు పెరుగుతున్నాయని అధికారులు వివరించారు.

కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే మైదానంలో ఏర్పాటు చేసిన ఆటో షో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో కే మహేశ్వర్, పక్కన యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ కేశవ్ గ్రోవర్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు

కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే మైదానంలో ఏర్పాటు చేసిన ఆటో షో ముగింపు కార్యక్రమానికి తరలివచ్చిన సందర్శకులు

కరీంనగర్ ఆటో షో గ్రాండ్ సక్సెస్

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో షో • పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నగర ప్రజలు

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 01 : కరీంనగర్ జిల్లా కేంద్రం నడ్డిబొడ్డులో 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఆటో షో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నగరంలోని మహాత్మ జ్యోతిబా పూలే (సర్కస్ గ్రౌండ్) మైదానం వేదికగా నిర్వహించిన షోకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్టాల్స్‌ను సందర్శించారు. మొదటిరోజు శనివారం నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించగా, ఆదివారం సాయంత్రం ముగింపు సమావేశానికి కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీలకు సంబంధించిన వివిధ మోడళ్ల ఆధునిక ఫీచర్లు, సదుపాయాలు ఇతర వాటి గురించి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. నగరవాసులు ఆయా స్టాళ్లలో వాహనాలను బుకింగ్ చేసుకోగా... మరికొందరు డెలివరీ తీసుకున్నారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కేశవ్ గ్రోవర్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, యాడ్స్ మేనేజర్ మల్లయ్య, సర్క్యులేషన్ మేనేజర్ పురుషోత్తం, స్టాఫర్ దొంత వెంకటస్వామి, ఫొటోగ్రాఫర్ బాలకిషన్‌రావు, హెచ్‌ఆర్ శ్రీలత, స్టోర్ ఇన్‌చార్జి రవి, టీ న్యూస్ ఇన్‌చార్జి వేణుగోపాల్, యాడ్స్ సిబ్బంది శ్రీధర్, కనుకయ్య, రాజు, నమస్తే తెలంగాణ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం ఖాళీ

మొదటిపేజీ తరువాయి...

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చోద్యం చూస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదు. నీటిని మళ్లించుకుపోకుండా ఏపీని నిలువరించడం లేదు.

ఇప్పటికే 400 టీఎంసీలకుపైగా తరలింపు

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ మట్టం 885 అడుగులకు చేరుకోగా, 215 టీఎంసీలతో కళకళలాడింది. పలుమార్లు క్రస్ట్‌గేట్లను ఎత్తివేశారు. కానీ, నెలలోనే పరిస్థితి తారుమారైంది. యాసంగి సీజన్‌కు నీటివిడుదల ప్రారంభం కాకముందే శ్రీశైలం రిజర్వాయర్ ఖాళీ అవుతున్నది. నెల వ్యవధిలోనే 93 టీఎంసీల జలాలు తగ్గిపోగా, రిజర్వాయర్‌లోని నీటినిల్వ 122 టీఎంసీలకు పడిపోయింది. ఎన్నడూ లేనివిధంగా ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా 190 టీఎంసీలకుపైగా జలాలను పెన్నా బేసిన్‌కు మళ్లించింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, జీఎన్‌ఎస్‌ఎస్, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల ద్వారా కూడా జలాలను తరలిస్తున్నది. నాగార్జునసాగర్ వద్ద కుడికాలువ, పంప్‌హౌజ్ ద్వారా కూడా కృష్ణా జలాలను ఏపీ నిరంతరాయంగా తరలిస్తున్నది. ఆదివారం సాయంత్రం నాటికి పీఆర్‌పీ నుంచి రెండు వేల క్యూసెక్కులు, సాగర్ కుడికాలువ ద్వారా 9,150 క్యూసెక్కుల జలాలను తరలిస్తూనే ఉండటం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటివరకు 400 టీఎంసీలకుపైగా జలాలను ఏపీ పెన్నా బేసిన్‌కు తరలించినట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

తెలంగాణకు గడ్డు పరిస్థితులే

శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటినిల్వలు వేగంగా తగ్గిపోవడంతో ఈ యాసంగిలోనూ తెలంగాణకు గడ్డుపరిస్థితులు వస్తాయని రైతాంగం, ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని నాగార్జునసాగర్ ఆయకట్టు కోసం 280 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కావాల్సిన 16.5 టీఎంసీలను శ్రీశైలం రిజర్వాయర్ నుంచే విడుదల చేయాల్సి ఉన్నది. శ్రీశైలం నుంచే కల్వకుర్తి లిఫ్ట్‌తోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలు ఆధారపడి ఉన్నాయి. కానీ, ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో 122 టీఎంసీలే అందుబాటులో ఉండడం ఆందోళనకరం. మరోవైపు ప్రస్తుతం సాగర్‌లో 306 టీఎంసీలే ఉండగా, అందులో ఎండీడీఎల్ స్థాయి వరకు 150 టీఎంసీలను మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అంటే నికర